క్లుప్తంగా

21నుంచి వాలీబాల్ పోటీలు

మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి గ్రామం అంబేడ్కర్ కాలనీలో ఈ నెల 21, 22 తేదీల్లో ఓపెన్‌టూఆల్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తాటిపల్లి అంబేడ్కర్ సంఘం సభ్యులు నర్సింహులు, రాములు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఒక్కో జట్టుకు రూ.600 ఎంట్రీ ఫీజును ఈనెల 20 వరకు చెల్లించి రశీదు పొందాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30.000, ద్వితీయ బహుమతి రూ.15,000 అందజేస్తామని తెలిపారు.

రేపు పిల్లల పండుగ

జహీరాబాద్: ఈ నెల 17న గ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జహీరాబాద్ పిల్లల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటి విద్యావ్యవస్థలో ప్రబలిపోయిన మూస పద్ధతికి భిన్నంగా పిల్లల్లో ఉండే సహజ సామర్థ్యాలను గుర్తించి, ప్రోత్సహించి పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు ఒక వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదర్శ విద్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో 76 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. చిత్రలేఖనం, కథారచన, కథ చెప్పడం, మట్టితో బొమ్మలు తదితర వాటిని విద్యార్థులు ప్రదర్శిస్తారన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. కార్యక్రమానికి ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఐటీ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌బాబును డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న విజయలక్ష్మి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సిరిపూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గది నిర్మాణానికి సర్పంచ్ మచ్చ విజయలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరమాటి సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ పరిశ్రమ ఆర్థిక సహకారంతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటనరసింహులు, మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఓఎస్ఏఏ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, హరీశ్ ఆయుష్, సోమనాథ్, శాంతి ప్రియ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డిలోని షెడ్యూల్డ్ ట్రైబల్ న్యాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ కృష్ణనాయక్‌ను కోరితే పరిష్కరించకుండా వేధిస్తున్నారని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

23న రైతు దినోత్సవం

సంగారెడ్డి టౌన్: ఈ నెల 23న నిర్వహించనున్న రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ సదాశివపేటలోని కార్యాలయానికి తరలిరావాలని కోరారు.

కబ్జా కోరల్లో శంభుని కుంట

అక్రమార్కుల గుప్పిట్లో ప్రభుత్వ భూములు

- స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో కబ్జాలు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- అన్యాక్రాంతమవుతున్న విలువైన భూములు




శంభుని కుంటలో కూల్చిన చోటే మళ్లీ నిర్మాణం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూములను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో అధికారులు బిజీగా ఉండడంతో కొందరు అక్రమార్కులు బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కుమ్మకై భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు రెండు రోజుల క్రితం అక్రమ నిర్మాణాలను తొలగించారు. అయినప్పటికీ మరుసటి రోజే అక్కడ పునర్నిర్మాణాలు చేపడుతూ అధికారులకు సవాలు విసురుతున్నారు.

కబ్జారాయుళ్లకు స్థానిక నేతల మద్దతు

అమీన్‌పూర్ పట్టణంలోని శంభునికుంట, గోశాల కిందివైపు ఉన్న ప్రభుత్వ భూములను అక్రమారులు కబ్జాలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తమకు బీఆర్ఎస్ నేతల మద్దతు ఉందని, వారి సూచనల మేరకే కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడుతున్నామని అక్రమార్కులు చెబుతున్నారు. మొన్నటివరకు అధికారంలో ఉన్న కొంతమంది బీఆర్ఎస్ నాయకులు తమను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రభుత్వ విభాగాల అధికారులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నాం

నేను ఇటీవలే బదిలీపై వచ్చాను. ఇక్కడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రెండు నెలల్లో అమీన్‌పూర్ పట్టణం, మండల పరిధిలో దాదాపు వందకుపైగా ఇళ్లను కూల్చివేశాం. ఇవన్నీ ప్రభుత్వ భూముల్లో వెలిసినవే. మున్సిపల్ వారు అక్రమ నిర్మాణాలకు సైతం ఇంటి నెంబర్లను ఇస్తున్నట్లు తెలిసింది. అయినప్పటికీ అన్ని ఇళ్లను కూల్చివేస్తున్నాం. కూల్చివేత ప్రక్రియకు అనేక ఒత్తిళ్లు వస్తున్నాయి.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు.. ప్రహరీ కూల్చివేత...

ప్రభుత్వ భూములు కాపాడేందుకు, అధికార యంత్రాంగం ప్రభుత్వ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించింది. ఇప్పుడున్న కలెక్టర్ శరత్ గతంలో జాయింట్ కలెక్టర్‌గా ఇక్కడ పనిచేసిన కాలంలో అ ప్రహరీ నిర్మించారు. అప్పట్లో ఆయన సర్వేనంబర్ 993, 630లో వందల ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడారు. కానీ ఇప్పుడు ఆ గోడను తెంచి భూములను కబ్జా చేస్తున్నారు.

నేడు మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో ఎన్నికలు


కర్మాగారం ఎదుట ఏర్పాటు చేసిన బ్యానర్లు

జహీరాబాద్: పట్టణ సమీపంలోని మహీంద్ర అండ్ మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో ఈ నెల 16న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ట్రాక్టర్ ప్లాంట్ యూనిట్‌లో రెండో పర్యాయం ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా సీఐటీయూ, బీఎంఎస్, భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్‌లు పోటీ పడుతున్నాయి. కర్మాగారంలో 410 మంది కార్మికులకు ఓటుహక్కు ఉంది. గత ఎన్నికల్లో టీఆర్ఎస్‌కే యూనియన్‌కు చెందిన రాంబాబుయాదవ్‌కు 239 ఓట్లు రాగా, సీఐటీయూకు 157 ఓట్లు, బీఎంఎస్‌కు 13 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కార్మికులు ఎవరి పక్షాన ఉంటారనేది పోలింగ్ అనంతరం తేలనుంది.

సమస్యలకు పరిష్కారం చూపండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాములు అన్నారు. ఎంపీడీఓ ఛాంబర్‌లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్యం తదితర సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంపీడీఓ రాములు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాభవాని

జిన్నారం(పటాన్‌చెరు): త్వరలో నిర్వహించనున్న ఎంపీ ఎన్నికల్లో పోలింగ్ బూతుల ఏర్పాటు తదితర విషయాలపై గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవాని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న పోలింగ్ బూతుల వివరాలు, ఇబ్బందులు, తదితర అంశాలపై ఆయా పార్టీల నేతలతో చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా పార్టీల అధక్షులు పాల్గొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి


వాలీబాల్ కిట్‌లను అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి సూచించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో లక్ష్మీనగర్ కాలనీకి చెందిన యువకులకు వీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జేజే సింగ్, జీవరత్నం, నవీన్, వినోద్, వంశీ పాల్గొన్నారు.

యూడైస్ ఫామ్స్ అందజేయాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పూర్తి చేసి యూడైస్ ఫామ్స్‌ను కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అందజేయాలని ఎంఈఓ మారుతి రాథోడ్ సూచించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదవుతున్నారు.? ఎంతమంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు? పాఠశాలల్లో సౌకర్యాలు తదితర అంశాలను ఆన్‌లైన్‌లో (యూడైస్ ప్లస్) నమోదు చేసి వాటి ప్రతులను కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అందించాలని సూచించారు. ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రవితో పాటు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌డీ రాష్ట్ర కన్వీనర్‌గా చంద్రశేఖర్ నియామకం

సంగారెడ్డి అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఢిల్లీ కేంద్రంగా నిర్వహించిన జాతీయ మహాసభల్లో సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం గార్లపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఎస్ఎఫ్‌డీ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప తెలిపారు. డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

18న సర్వసభ్య సమావేశం

మునిపల్లి(అందోల్): ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శైలజ, జడ్పీటీసీ మీనాక్షి అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరినందన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు హాజరుకావాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో అన్నప్రాసన

నారాయణఖేడ్: మండల పరిధిలోని ర్యాకల్‌లోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాలామృతం, పౌష్టికాహారాన్ని తినిపించారు. పౌష్టికాహార ఆవశ్యకతను సీడీపీఓ సుజాత, గర్భిణులు, బలింతలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల పిల్లలు ఆడుకొనేందుకు సర్పంచ్ పట్లోళ్ల సుజాత సొంత ఖర్చుతో ప్రీస్కూల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రేపు ఆల్‌ఇండియా పెన్షనర్స్ డే

సదాశివపేట(సంగారెడ్డి): ఈ నెల 17న ఆల్ ఇండియా పెన్షనర్స్ డేను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పండరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11గంటలకు సదాశివపేట పట్టణంలోని సంఘం భవనంలో బోడపల్లి శంకరప్ప ఆధ్వర్యంలో పెన్షనర్స్‌డే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రిటైర్డ్ పెన్షనర్లు హాజరు కావాలని కోరారు.

కార్మిక సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న రాంబాబు

జహీరాబాద్: కార్మిక సంక్షేమం కోసం కృషి చేస్తానని.. తనకు మరోసారి అవకాశమిచ్చి గెలిపించాలని బీఆర్‌టీయూ అభ్యర్థి రాంబాబు అన్నారు. మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్ యూనిట్ వద్ద శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని, తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివి


నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

నారాయణఖేడ్: భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన కోసం ప్రాణత్యాగం చేసిన మహానీయుడు పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మునిగాల మాణిక్ ప్రభు అన్నారు. నారాయణఖేడ్‌లో శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాణిక్‌ప్రభు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, స్థానిక బాధ్యులు సత్యనారాయణ, బూషణం, కృష్ణమూర్తి, నగేష్, సంతోష్‌కుమార్, అశోక్, నందు, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి


రైతులతో మాట్లాడుతున్న విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ విద్యార్థులు అన్నారు. మండలంలోని సీతారాంపూర్‌లో వ్యవసాయ విద్యార్థులు శుక్రవారం సర్వే నిర్వహించారు. డి రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ (కృషి విజ్ఞాన కేంద్రం)లో వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు గ్రామంలో సర్వే చేసి, గ్రామ పటాన్ని ఏర్పాటు చేసి రైతులకు గ్రామస్తులకు సాగుపై అవగాహన కల్పించారు. రైతులు తరచూ పంట మార్పిడి చేస్తూ, సేంద్రియ ఎరువులు వాడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్, రవికుమార్, విద్యార్థులు అనుష్క, దేవిశ్రీ, ద్రిష్టి, నితీష్, ప్రేసి, బ్రిందా తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ఘన స్వాగతం

సంగారెడ్డి టౌన్: శబరిమల దేవాలయం వరకు రాము గురుస్వామి ఆధ్వర్యంలో మహా పాద యాత్ర పూర్తిచేసుకొని వచ్చిన గురుస్వాములకు సంగారెడ్డి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఘన స్వాగతం పలికారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా, హనుమాన్ దేవాలయం వద్ద నుంచి నవరత్నాల దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా పడిపూజ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొంతపల్లిలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మహాపడిపూజ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వందలాది మంది అయ్యప్ప స్వాములు హాజరై పూజలు నిర్వహించారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్(అందోల్): మండలంలోని చిమ్నాపూర్ గ్రామంలోని రవికుమార్ నివాసంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన స్వాములు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

19న సర్వసభ్య సమావేశం

కంగ్టి(నారాయణఖేడ్): మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఈ నెల 19న ఎంపీపీ సంగీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముజఫరొద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

కొనసాగుతున్న సమ్మె


సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

నారాయణఖేడ్: వివిధ డిమాండ్ల పరిష్కారం కోసం నారాయణఖేడ్‌లో తపాలా ఉద్యోగులు, సిబ్బంది చేపట్టిన సమ్మె శుక్రవారంతో నాలుగో రోజుకు చేరింది. తపాలా ఉద్యోగుల సంఘం బాధ్యులు శిరోమణి, నర్సారెడ్డి, హన్మారెడ్డి, నాగయ్య, అశోక్ బాబు, మాణిక్యప్ప, సంగమేశ్వర్, సుప్రియ పాల్గొన్నారు.

దామోదరకు సన్మానం



మునిపల్లి(అందోల్): ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు బుదేరా మాజీ సర్పంచ్ మనోహర్‌యాదవ్, బుస్సారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ వెంకట్‌రాములు కలిసి శుక్రవారం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మంత్రి దామోదరను ఆయన చాంబర్‌లో కలిసి సన్మానించారు.

వ్యక్తి అదృశ్యం


మహేశ్

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కలబురిగికి చెందిన మొగిలి మహేశ్(32) బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ముత్తంగి వచ్చి కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన సొంతూరికి బయలుదేరానని తన సోదరుడు మొగిలి సురేష్‌కు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. అయితే మహేష్ తన స్వగ్రామానికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు మహేశ్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మహేశ్ సోదరుడు సురేష్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి


బాల్‌రెడ్డి(ఫైల్)

నారాయణఖేడ్: మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట్‌కు చెందిన మాజీ పీఏసీఎస్ కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గునుకుల బాల్‌రెడ్డి(75) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు. అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

మునిపల్లి(అందోల్): కొత్త పట్టా పాస్‌బుక్ ఉన్న రైతులు రైతుబంధు మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, ఫోన్‌నంబర్ లింక్‌ను వ్యవసాయ విస్తరణ అధికారులు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేస్తున్నారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


స్వపన్ సైబీయా మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన స్వపన్ సైబీయా(38) బతుకు దెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండలం ఘనపూర్ వచ్చాడు. భవ్య విలాస్‌లో కూలి పనిలో చేరాడు. తరచూ మద్యం తాగి వస్తుండటంతో అతడిని పనిలో నుంచి తొలగించారు. ఈనెల 12వ తేదీన భవ్య విలాస్‌లో పనిచేసే స్నేహితులను కలిసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం కావడంతో వారంతా భోజనానికి వెళ్లారు. అయితే రెండో అంతస్తు పైకి వెళ్లిన స్వపన్ సైబీయా తిరిగి కిందకు వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కార్మికులు చికిత్స కోసం గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి మేనమామ తోపేసియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.